

అలరించిన 'అనంతం.. సాయి ఈశ్వరం'

పాల్గొన్న సాయిపల్లవి

పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మండపంలో సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు మంగళవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. 'అనంతం.. సాయి ఈశ్వరం' అంటూ ఆలపించిన భక్తి గీతం భక్తులను మైమరపింపజేసింది. అనంతరం మహాభారతం, రామాయణంలోని ఘట్టాలను నాటిక రూపంలో కళ్లకు కట్టారు. కార్యక్రమంలో సినీ నటి సాయిపల్లవి పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



నాటికలోని సన్నివేశం, పాల్గొన్న హీరోయిన్ సాయిపల్లవి



ఇంటర్ విద్యార్థులకూ ప్రోగ్రెస్ కార్డులు

మెరుగైన ఫలితాలే లక్ష్యంగా చర్యలు
తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు
ఈ ఏడాది నుంచే అమలు

ధర్మవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగు పరచడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానంతో విద్యార్థులు పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, వారి ప్రగతి తల్లిదండ్రులకు తెలియజేయడం ద్వారా మంచి ఫలితాల సాధనకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యా విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు, అంతర్గత పరీక్షల్లో వారు సాధించిన మార్కుల వివరాలను సదరు కార్డుల్లో నమోదు చేయనున్నారు. తల్లిదండ్రులకు చూపించి వారితో సంతకాలు చేయించి కళాశాలకు తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఇంటర్‌లో నెలకు ఒకటి చొప్పున నాలుగు యూనిట్ పరీక్షలు, త్రైమాసికం, అర్ధ సంవత్సరం, ప్రీ ఫైనల్ పరీక్షలు రెండుసార్లు నిర్వహిస్తారు. వృత్తివిద్యా కోర్సులు చదివే విద్యార్థులకు తెలుపు, జనరల్ ప్రథమ సంవత్సరం వారికి లేతపసుపు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లేత నీలం రంగుల్లో కార్డులు సిద్ధం చేస్తున్నారు. హాజరు వివరాలు నమోదు చేయడంతో విద్యార్థులు సక్రమంగా కళాశాలలకు వెళ్తున్నారా, లేదా అనే విషయాలు తల్లిదండ్రులకు తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కార్డుల నమూనా, జారీపై అధికారులు.. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, ప్రోగ్రెస్ కార్డుల గురించి తెలియజేస్తూ వీటిని తప్పక అనుసరించాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 6,400 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకే: రఘునాథరెడ్డి, డీవీఈఓ

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రోగ్రెస్ కార్డుల విధానం దోహదం చేస్తుంది. ఈ ఏడాది నిర్వహించే ప్రతి పరీక్షకు సంబంధించిన వివరాలు, హాజరు శాతం, ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి, తల్లిదండ్రులకు పంపిస్తారు. దీంతో విద్యార్థుల వివరాలు, వారి పరిస్థితి అధ్యాపకులకు ముందుగానే తెలుస్తాయి. దీని ఆధారంగా వారిని బాగా చదివించి, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తాం.

పింఛన్ల పంపిణీ చరిత్రలో నిలిచిపోతుంది

త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
మంత్రి సవిత.. పలువురికి పింఛన్ల పంపిణీ

పెనుకొండ టౌన్/పెనుకొండ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరోజు ముందే పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నారనీ, ఇది చరిత్రలో నిలిచిపోతుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని మారుతీ నగర్, మండలంలోని అడదాకులపల్లిలో మంత్రి సవిత.. అధికారులు, కూటమి నాయకులతో కలిసి మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరించారు. 1వ తేదీకి ముందే పింఛన్ సక్రమంగా వస్తోందని, అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయనీ, చంద్రబాబుకు రుణపడి ఉంటామని పింఛన్‌దారులు తెలిపారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. జగన్ ఐదేళ్ల పాలనలో బటన్ నొక్కడంతప్ప.. అభివృద్ధి చేయలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రాజధాని, గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తుందన్నారు.



పెనుకొండలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి సవిత

సామాజిక తనిఖీ గడుపు పొడిగింపు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై సామాజిక తనిఖీ గడువును జనవరి 7వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి శివరంగప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. అభ్యంతరాల స్వీకరణ గడువు మంగళవారంతో ముగిసిందనీ, దీనిని ప్రభుత్వం 7 వరకు పొడిగించిందన్నారు. ఆ మేరకు 7వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామనీ, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, తుది జాబితాను ఈనెల 17న ప్రచురిస్తామని ఆయన వివరించారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి,రూరల్ డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో వివిధ రకాలైన సేవలందించే వారికోసం నైపుణ్యాభివృద్ధి సంస్థ అందించే శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్ ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్ మెకానిక్‌లు, బ్యూటీషియన్ శిక్షణ ఇస్తారన్నారు. పూర్తిచేసిన వారికి ధృవపత్రంతోపాటు ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 5వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9493537727, 9493538967, 9493533146 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.


ఎట్టకేలకు టెండర్లు ఖరారు

పుట్టపర్తి టౌన్, డిశంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలకు నిత్యవసర సరుకులు, కోడిగుడ్లు, చికెన్ సరఫరా టెండర్లు ఎట్టకేలకు మంగళవారం రాత్రి ఖరారయ్యాయి. బుక్కపట్నంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో టెండర్లు స్వీకరించారు. తుది టెండర్లు ఖరారు చేయడంలో అక్కడి అధికారులు తుది నిర్ణయం తీసుకోకపోవడంతో సోమవారం జిల్లా కార్యాలయానికి టెండరు దారులు చేరుకుని, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో చర్చించారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత కూడా టెండర్లు కొలిక్కిరాకపోవడంతో మంగళవారానికి వాయిదా వేశారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు టెండరుదారులతో జేసీ చర్చించారు. తుది టెండర్లను ఖరారు చేశారు.

తలుపులు వేసుకుని తతంగం

జిల్లావ్యాప్తంగా కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలకు సరుకుల సరఫరాకి సంబంధించి 49 మంది టెండర్లు వేశారు. వాటిని 15 టెండర్లను అధికారులు తిరస్కరించారు. మిగిలిన 34 అనుమతించారు. వీటిలో తుది టెండర్లను ఖరారు చేయడానికి జేసీ అధ్వర్యంలో అధికారులు రెండురోజులపాటు తీవ్రంగా ప్రయత్నించారు. కలెక్టర్ కార్యాలయంలో తలుపులు వేసుకుని, రెండు రోజుల పాటు తీవ్రంగా చర్చించి, మంగళవారం రాత్రి ఖరారు చేశారు. టెండర్ల గదిలోకి మీడియాను అనుమతించకపోవడం గమనార్హం. ఇదివరకే సరుకులను సరఫరా చేస్తున్నవారే ప్రస్తుతం కూడా బినామీ పేర్లతో టెండర్లు దక్కించుకున్నట్లు సమాచారం. ఈ టెండర్ల ప్రక్రియలో జేసీతోపాటు జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, జిల్లా విద్యాధికారి కిష్టప్ప, సమగ్రశిక్ష అధికారులు పాల్గొన్నారు.





ఫిబ్రవరి 28లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

పుట్టపర్తి టౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు ఫిబ్రవరి 28వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని జిల్లా ఖజానా శాఖాధికారి నాగమల్లిక మంగళవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఫిబ్రవరి 28లోగా అందుబాటులో ఉన్న ఉప ఖజానా కార్యాలయాల్లోగానీ, ఇంటర్నెట్ సేవాసంస్థల ద్వారా ఆన్‌లైన్‌లో జీవన్ ప్రమాణ పోర్టల్ ద్వారా ధృవపత్రాన్ని సమర్పించాలని ఆమె వివరించారు.

కొంగొత్త ఆశలు.. ఆకాంక్షలు..



కియ కార్ల పరిశ్రమలో పని చేస్తున్న యువత

నూతన ఏడాదిపై ప్రజల్లో ఆశలు.. 2025లో యువతకు ఉద్యోగాల పంట

ఏడు నియోజకవర్గాలతో ఏర్పడిన జిల్లాలో స్థిరమైన ఉపాధి అవకాశాలు అపారమైన అవకాశాలున్నాయి. పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో అభివృద్ధి శరవేగంగా సాగుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం స్థూల ఆదాయం పరంగా రాష్ట్రంలో జిల్లా 16వ స్థానంలో నిలిచింది. పారిశ్రామికంగా 9వ, వ్యవసాయ పరంగా 15వ ర్యాంకులో ఉంది. రాబోయే రోజుల్లో జిల్లాలో ఉపాధి కల్పన లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. ఆ మేరకు యువతలోని నైపుణ్యాలను మెరుగు పరిచి, యువశక్తిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. పలురంగాల్లో గతేడాది తీసుకున్న నిర్ణయాలు కొత్త సంవత్సరంలోనూ కొనసాగిస్తే అభివృద్ధి పట్టాలెక్కి రాష్ట్రంలోనే ఉపాధి కల్పన జిల్లాగా నిలవడం ఖాయం. తద్వారా జిల్లా ప్రజల జీవన ప్రమాణాల్లో పెనుమార్పులు వస్తాయి. ఈనేపథ్యంలో 2024కి ముగింపు పలికి కొత్త ఏడాదికి జిల్లా ప్రజలు స్వాగతం పలుకుతున్నారు.జి

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా..

పెనుకొండ వద్ద కియ కార్లు, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా అవతరించింది. జిల్లాలో తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామిక వాడల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన బెల్, నాసెన్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. దీంతో జిల్లాలో రక్షణ రంగ పరికరాల మాన్యుఫాక్చరింగ్ సంస్థలు జిల్లా వైపు చూస్తున్నాయి. ఉమ్మడి జిల్లాతోపాటు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి ఉపాధి కోసం జిల్లాకు క్యూకట్టారు. జిల్లావ్యాప్తంగా 17 ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు చేసి, ఉపాధి కల్పన జిల్లాగా మార్చాలని ప్రభుత్వం 4.0 పారిశ్రామిక విధానాన్ని తీసుకొచ్చింది. 2025లో జిల్లాకు పరిశ్రమలు క్యూకడతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రజల ఆకాంక్షలు నేరవేరేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. నాడు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలన వెళ్లిన యువత సొంతూర్లకు తిరిగొచ్చే రోజు ఎంతో దూరంలో లేదని పారిశ్రామిక వర్గాలు పేర్కొంటున్నాయి.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. 42 రకాల ఉద్యానవన పంటల సాగుకు అనుకూలమైన జిల్లా. టమోటా, మామిడి, అరటి, దానిమ్మ, పంటల ఎగుమతుల్లో అగ్రస్థానం. జిల్లాలో ఉంది. ఉద్యానవన పంటల సాగులో రైతును ప్రోత్సహించే దిశగా 30 వేల హెక్టార్లలో సూక్ష్మసేద్యం పరికరాలను అందించారు. రైతుకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో రాయితీలు ఇస్తోంది.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే కదిరి, మడకశిర, ధర్మవరం ప్రాంతాల్లో ఏర్పాటుకు భూములను గుర్తించారు. ఈ పరిశ్రమల ఏర్పాటు దిశగా కొత్త ఏడాదిలో అడుగులు పడాలి. రైతుకు మేలుతోపాటు వ్యవసాయ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కల్పించే అవకాశాలు ఉంటాయి.

పర్యాటకానికి ఊతం

జిల్లాలో చారిత్రాత్మక సంపద, కళాకృతులు, మన భాష, సంస్కృతిని తెలిపే శిల్పవైభవం, కట్టడాలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలకు కొదలేదు. శిల్పకళల కాణాచి లేపాక్షి, రాయల రెండో రాజధాని పెనుకొండ, కదిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ అతిథి పక్షులు విడిదిచేసే వీరాపురం, ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరం చేనేత పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, తిమ్మమ్మ మర్రిమాను ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లా అంతటా పర్యాటక, చారిత్రక విశేషాలున్నాయి. వీటన్నింటినీ అభివృద్ధి చేసి ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా పాలకులు అడుగులు వేస్తున్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక వలయంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలతో కొత్త సంవత్సరంలో కార్యాచరణ చేపట్టాలి. పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

చేనేతకు చేయూత

జిల్లాలో వ్యవసాయం తరువాత లక్షలాది కుటుంబాలు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. చేనేత కార్మికులతోపాటు చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేదిశగా ధర్మవరంలో రూ.30 కోట్లతో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. అది ఏర్పాటైతే చేనేత పరిశ్రమపై ఆధారపడిన లక్షలాది మందికి ఉపాధి లభిస్తుంది. చేనేత ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా ఆ రంగానికి చేయూత నిచ్చారు. లక్షలాది మంది యువతకు చేనేత రంగంలో సాంకేతికతతోపాటు ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

నైపుణ్య శిక్షణ

జిల్లాలో జనాభాపరంగా అధిక సంఖ్యలో యువత ఉన్నా.. నైపుణ్యం విషయంలో మాత్రం వెనుకబడే ఉన్నారన్నది అంగీకరించాల్సిన వాస్తవం. గత వైసీపీ పాలనలో నైపుణ్య శిక్షణ ఇవ్వకపోవడంతో జిల్లా యువత ఉద్యోగాలు సాధించలేక లక్షల మంది నిరుద్యోగులుగా మారారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం యువతకు నైపుణ్య శిక్షణపై దృష్టి సారించింది. 500పైగా పరిశ్రమల్లో నైపుణ్య శిక్షణ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా జిల్లాలో 8 హబ్‌లతోపాటు నైపుణ్య శిక్షణ కళాశాలల్లో శిక్షణ మొదలు పెట్టారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఎయిర్ కనెక్టివిటీ..

జిల్లాలో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందుకు ఉన్న అవకాశాలపై సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సన్నాహాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్ పోర్టుగా మార్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు మొదలెట్టాయి. ఈ ఏడాదిలో అన్నీ అనుకున్నట్లు సాగితే జిల్లా పౌరవిమాన సర్వీసులతో ప్రపంచదేశాలకు ఎయిర్ కనెక్టివిటీ పెరగడంతోపాటు వేలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు సొంతూరిలోనే దక్కుతాయి.

ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం

నేటి నుంచి అమలు.. తప్పనున్న ఆకలి బాధలు

కొత్తచెరువు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆకలి బాధలు తప్పనున్నాయి. బుధవారం నుంచి కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లావ్యాప్తంగా 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 6,220 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దుచేసింది. దీంతో విద్యార్థులు అర్ధాకలితో చదువులు కొనసాగించే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పలు సదుపాయాలు కల్పించింది. ఇటీవల ఉచితంగా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు అందజేసింది. ఇప్పుడు మధ్యాహ్న భోజనం కూడా అందించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థిసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యుదాఘాతంతో
నాయీబ్రాహ్మణుడి మృతి


ధనుంజయ మృతదేహం

ధర్మవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో నాయీబ్రాహ్మణుడు ధనుంజయ(40) మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన ధనుంజయ ఎర్రగుంట సర్కిల్‌లో బార్బర్‌షాపు నిర్వహిస్తున్నాడు. షాపుపై బోర్డు అమర్చుతుండగా ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న విద్యుత్ మెయిన్ లైన్ తీగలు తగిలి, కరెంటుషాక్ తగిలింది. దీంతో కిందకు పడి అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ధనుంజయకు భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

రిజర్వాయర్‌లో పడి
టెకీ మృతి


సంతోష్ మృతదేహం

పెనుకొండ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సంతోష్ (23) మంగళవారం మరణించాడు. కియ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతోష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండేవాడు. కర్ణాటక రిజిస్ట్రేషన్ ద్విచక్రవాహనంలో మంగళవారం మధ్యాహ్నం గొల్లపల్లి రిజర్వాయర్ సందర్శనకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడి మృతిచెందాడు. దీనిపై స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. కియ పోలీసులు రిజర్వాయర్ వద్దకు చేరుకుని, మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు కియ పోలీసులు తెలిపారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.7

అనంతపురం రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 7తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.5, కనిష్ఠ ధర రూ.4 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 27వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 27,420 పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 16వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 11 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రిజర్వాయర్‌కు 777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 777 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 175 క్యూసెక్కులు వెళుతుందని వివరించారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీలు నీరు వున్నట్లు పేర్కొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లను తీసుకెళ్లండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని పెన్షనర్ల కార్యాలయంలో బుధవారం నుంచి లైఫ్ సర్టిఫికెట్లను ఇస్తామని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన గౌడ్ తెలిపారు. పెన్షనర్లు సర్టిఫికెట్లను తీసుకుని ఎస్టీఓ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

7 వరకూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల గణన అభ్యంతరాలను ఈ నెల 7వ తేదీవరకు స్వీకరిస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ మంగళవారం తెలిపారు. డిసెంబరు 31కి గడువు ముగిసిందని, దీంతో మరో వారం పొడిగించామని తెలిపారు. 7వ తేదీ తరువాత అభ్యంతరాలను పరిశీలిస్తామని తెలిపారు.

ఓ పాఠశాల వ్యథ !

వేధిస్తున్న తరగతి గదుల కొరత
మరుగుదొడ్లు లేవు.. ఆటస్థలం లేదు
అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
ఆగిపోయిన కొత్త పాఠశాల భవన నిర్మాణం
తాటిచెర్ల జడ్పీ పాఠశాలలో సమస్యల తిష్ట



అర్ధంతరంగా ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణం

అనంతపురంరూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిచెర్ల ప్రభుత్వ పాఠశాల స్థాయి పెరిగిందే తప్ప వసతులు ఏమాత్రం మెరుగుపడలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమై యూపీ, జిల్లా పరిషత్ పాఠశాలగా రూపాంతరం చెందింది. అయితే అందుకు అనుగుణంగా వసతులు, సౌకర్యాలు కల్పించలేదు. తరగతులకు అనుగుణంగా గదులు లేకపోవడం ప్రధాన సమస్య. పిల్లలకు బోర్డు మీద పాఠాలు బోధించాలంటే నిత్యం ఓ తరగతి పిల్లలు బయట కూర్చునే దుస్థితి నెలకొంది. ఫలితంగా విద్యార్థులను, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్న గదులు సైతం ఇరుకుగా ఉండటంతో మరిన్ని అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇరుకు గదులతో అవస్థలు

స్థానిక పాఠశాలలో ఒకటి నుంచి పదివరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకటి రెండు తరగతుల్లో 27మంది పిల్లలున్నారు. మూడు నుంచి పదో తరగతి వరకు 163మంది పిల్లలున్నారు. తరగతులకు అనుగుణంగా గదులు లేకపోవడం సమస్యగా మారింది. పాఠశాల మొత్తంగా ఉన్న గదుల్లో పిల్లలకు తొమ్మిది గదుల్లో పాఠాలు చెబుతుండగా..హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు ఒక గది ఉంది. ఆ గదులు కూడా ఇరుకుగా ఉండటంతో బోధనకు ఇబ్బందులు తలెత్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలంటే నిత్యం ఏదో ఒక తరగతిని పాఠశాల ఆవరణలో ఉంచాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సౌకర్యంగా తిరిగేందుకు వీలులేని విధంగా తరగతి గదులున్నాయి. తరగతి గదుల్లోకి గాలి, వెలుతురు కూడా వచ్చే పరిస్థితి లేదు. భోజన విరామ సమయంలో విద్యార్థులు కొంత సేపు ఆడుకునేందుకు కూడా పాఠశాలలో మైదానం లేకపోవడం గమనార్హం. జిల్లా పరిషత్ పాఠశాలలో స్త్రీ, పురుష ఉపాధ్యాయులకు వేరు వేరుగా గదులుంటాయి. ఇక్కడ అందరికీ ఒకటే ఉండటం పాఠశాల దుస్థితిని చెబుతోంది. విద్యార్థిని, విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు సైతం లేవు. నాడు-నేడు కింద వచ్చిన విద్యార్థులు కూర్చునే బల్లలు ఓ గదిలో పడేశారు. దీంతో ఓ గది విద్యార్థులకు లేకుండా పోయింది. స్కూల్ ప్రహరీ ఇటీవల కూలిపోయింది.



పడిపోయిన పాఠశాల ప్రహరీ



మూలన పడేసిన బెంచీలు



తరగతి గదుల సమస్యతో పాఠశాల ఆవరణలో ఉన్న విద్యార్థులు

నిలిచిపోయిన పనులు

గ్రామంలో మరో చోట గత ప్రభుత్వ హయంలో నాడు-నేడు కింద జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణం చేపట్టారు. నిర్మాణం చాలా వరకు పూర్తి అయింది. అయితే బిల్లులు మంజూరు కాకపోవడంతో ఏడాదిన్నర కాలంగా పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారిన తరువాత పాఠశాల నిర్మాణాలపై పురోగతి ఉండటం లేదు. పాఠశాల నిర్మాణం పూర్తయితే విద్యార్థులు, ఉపాధ్యాయులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పాఠశాల సమస్యలపై దృష్టి సారిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఉన్నతాధికారులకు నివేదించాం

పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. గ్రామంలోనే జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణం జరుగుతోంది. అది పూర్తయితే చాలా వరకు సమస్యలు తీరుతాయి.

- రాంకుమార్, హెచ్‌ఎం, జడ్పీహెచ్‌ఎస్, తాటిచెర్ల



జిల్లా క్రికెట్ సంఘం సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న క్రికెటర్ల తల్లిదండ్రులు

అర్హులకు అవకాశం కల్పించాలి

సెలెక్షన్ కమిటీకి తల్లిదండ్రుల వినతి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అండర్-12 జిల్లా క్రికెట్ జట్టులో అర్హులైన క్రీడాకారులకు అవకాశం కల్పించాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరారు. అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డిని మంగళవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. అండర్-12లో జిల్లా జట్టు సెలెక్షన్స్‌లో ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అన్యాయం జరిగిందని అన్నారు. ఇప్పటికే పలు మార్లు జిల్లా క్రికెట్ సంఘం, సెలెక్షన్‌కమిటీ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. సెలెక్షన్ లిస్టులో వయసు మీరినవారు ఉన్నారని, వెంటనే తొలగించి అర్హులకు చోటు కల్పించాలని కోరారు. అర్హులకు న్యాయం చేస్తామని, క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు వారికి వివరించారు.

14 వరకు గడువు

అనంతపురం విద్య, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చ-2025కు ఈ నెల 14వ తేదీలోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు ఇందులో పాల్గొనవచ్చునని తెలిపారు. ప్రధాన మంత్రిని నేరుగా కలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ అభిప్రాయాలను, ప్రశ్నలను http-s://innovatein-dia1.mygov. in/లో రిజిస్ట్రేషన్ చేసుకుని పంపవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు అనంతపురం జిల్లావారు ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి సెల్ నంబర్ 8328012659కు, శ్రీసత్యసాయి జిల్లావారు పోలా లక్ష్మీనారాయణ సెల్ నంబర్ 9440944737కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- మేయర్ వసీంకు కార్పొరేషన్ల డైరెక్టర్ల సవాల్

అనంతపురం అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఏడు నెలల్లో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు నగర మేయర్ వసీంకు సవాల్ విసిరారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో పద్మశాలి, రజక, నాయీబ్రాహ్మణ, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వరన్, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తి మీడియాతో మాట్లాడారు. జగన్ తరహాలోనే కళ్లు ఉండి చూడలేని వ్యక్తిగా మే యర్ వసీం తయారయ్యారని మండిపడ్డారు. ఏడు నెలల్లో ఎమ్మె ల్యే దగ్గుపాటి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాడో మీరొస్తే నేరుగా చూపిస్తామన్నారు. మీరు చేసిన అవినీతిపై ఇప్పటికే కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారన్నారు.

వైసీపీకి బిగ్‌షాక్

టీడీపీలోకి ముగ్గురు జడ్పీటీసీలు, ఎంపీపీ
ఆహ్వానించిన మంత్రి పయ్యావుల కేశవ్



మంత్రి సమక్షంలో టీడీపీలోకి చేరిన జడ్పీటీసీలు, ఎంపీపీ

ఉరవకొండ/బెళుగుప్ప, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ఉరవకొండ నియోజకవర్గంలో కోలుకోలేని దెబ్బ పడింది. ముగ్గురు జడ్పీటీసీలు, ఒక ఎంపీపీ సహా పలువురు సీనియర్ నాయకులు మంత్రి పయ్యావుల కేశవ్ సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. వజ్రకరూరు జడ్పీటీసీలు తేజశ్విని, ఆమె భర్త వశికేరి రమేష్, కూడేరు జడ్పీటీసీ అశ్విని, ఆమె భర్త హరీష్, విడపనకల్లు జడ్పీటీసీ హనుమంతు, బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న, వైసీపీ విడపనకల్లు మండల కన్వీనర్ బసన్న ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. కొకుంట్లలో మంత్రి కేశవ్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరుతున్నారని అన్నారు. వైసీపీ దమనకాండతో వారు విసిగిపోయారని అన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అరాచక పాలన, కూటమి అధికారంలోకి వచ్చాక ఆరు నెలల పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని అన్నారు. విజనరీ చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధివైపు దూసుకుపోతోందని అన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని ఎంపీపీ పెద్దన్న అన్నారు. విశ్వేశ్వరరెడ్డికి ఆరుసార్లు ఎమ్మెల్యేగా టికెట్టు ఇస్తే ఒక్కసారి గెలిచారని, ఆయన వల్ల ప్రజలకు ఎక్కడా మేలు జరగలేదని అన్నారు. రాజకీయాన్ని అడ్డుపెట్టుకుని కేవలం సంపాదన కోసమే పనిచేశారని విమర్శించారు. విశ్వేశ్వరెడ్డి అత్యంత సన్నిహితుడు, ఆయన అధికారాలను అడ్డు పెట్టుకుని, అంగన్‌వాడీ ఉద్యోగులను, చిరుద్యోగులను బదిలీ చేయిస్తానని బెదిరించి, డబ్బులు వసూలు చేశాడని, కోట్లు సంపాదించాడని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు ప్రసాద్, నాగరాజు, మల్లికార్జున, తిప్పయ్య, బ్యాళ్ల ఈశ్వరయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

వైసీపీకి రాజీనామా

మండల అధ్యక్షుల సంఘం జిల్లా అధ్యక్షుడు, బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న వైసీపీ సభ్యత్వానికి మంగళవారం రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిపై ఆయన విలేకరుల సమక్షంలో ధ్వజమెత్తారు. ఆయన సొంతూరిలోనే టీడీపీకి మెజారిటీ వచ్చిందని ఎద్దేవా చేశారు. స్వార్థ రాజకీయాల కోసం కుటుంబ సభ్యులతో పాటు పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం చేశారని అన్నారు. ఆయనకు రాజకీయంగా పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. పయ్యావుల సోదరులతో కలిసి టీడీపీ కోసం పనిచేస్తానని అన్నారు.

బేకరీల్లో తనిఖీలు.. కేసులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ అధికారులు ఉమ్మడి జిల్లాలోని బేకరీలు, మిఠాయిల దుకాణాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. అనంతపురం, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం, పుట్టపర్తి ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. తూకం తక్కువ ఇస్తున్నందుకు అనంతపురంలో నాలుగు బేకరీలు, బత్తలపల్లిలో 2, ధర్మవరంలో 2 బేకరీలపై కేసులు నమోదు చేశామని ఆ శాఖ ఇన్స్‌పెక్టర్ మహమ్మద్ గౌస్ తెలిపారు. తినుబండారాల ప్యాకేజీలపై తయారీదారుల చిరునామా, గడువు, ధరలు, వినియోగదారుడు ఫిర్యాదు చేసేందుకు ఉండాల్సిన పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ లేకపోవడం, శీతల పానీయాలను అధిక ధరలకు విక్రయించడం తదితర ఉల్లంఘనలపై మొత్తం 14 కేసులు నమోదు చేశామని, ఏడుగురు దుకాణదారులకు రూ.38 వేల జరిమానా విధించామని తెలిపారు. తనిఖీలలో ఆ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కె.మహమ్మద్ పాల్గొన్నారు.

మాట మీద నిలబడే ప్రభుత్వం మాది

- ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి/రామగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీ రాకనే ఇంటి ముందుకు వెళ్లి పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మాట ఇస్తే నిల బడే నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. ఎమ్మెల్యే మంగళవారం చెన్నేకొత్తపల్లి మండలంలోని హరియన్‌చెరువు గ్రామంలో ఇటింటికి వెళ్లి పింఛన్‌లను పంపిణీ చేశారు. అలాగే రామగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆమె పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓశివశంకరప్ప, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్, టీడీపీ సీకేపల్లి మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, జనసేన మండల కన్వీనర్ ఇటికోటి క్రాంతికుమార్, మాజీ ఎంపీపీ అంకే అమరేం ద్ర, ప్రధాన కార్యదర్శి ముత్యాలప్ప, రాజు, రైతు సంఘం రామగిరి మండల అధ్యక్షుడు అక్కులప్ప, నాయకులు గొల్ల అక్కులప్ప, గుర్రంశీన, నరసయ్య, క్రాంతి, మనోహర్, అనిల్, సురేశ్, నాగరాజు పాల్గొన్నారు. అలాగే రామగిరిలో పింఛన్ల పంపిణీకి వ్యవసాయ పొ లాల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే పరిటాల సునీత లబ్ధిదారులతో కలిసి వరి నాట్లు వేశారు.



రామగిరిలో పొలాల వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేని కలిసిన ఎంపీడీఓ

రామగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ చంద్రమౌళి మంగళవారం ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని వెంకటాపురంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎంపీడీఓగా బాధ్యతల చేపట్టి మూడు రోజులైంది.



ట్రాన్స్‌కో ఏడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు ట్రాన్స్‌కో ఏడీకి మంగళవారం విన్నవించారు. ఈ మేరకు ఏఐటీయూసీ నాయకులు రమణ మాట్లాడుతూ.. ఒకటే డిస్కంలో రెండు పనులు చేయడం చట్ట విరుద్ధమన్నారు. అదే విధంగా సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ మీటర్ రీడింగ్ తీస్తున్న ముగ్గురు వ్యక్తులను మీటర్ రీడింగ్ నుంచి తీసివేయాలని కోరారు. లేకపోతే ఆదివారం మీటర్ రీడర్స్ అందరూ కలిసి సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ మీటర్ రీడర్స్ పనిదినాలను పెంచాలన్నారు. మీటర్ రీడర్స్‌కు ఎస్కో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కిరణ్ కుమార్, నాయకులు బాబావలి, జగదీశ్‌కుమార్, బాలశివ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

చిలమత్తూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి దర్గా వద్ద నిద్రచేయాలని వచ్చి రోడ్డుప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. హిందూపురం పట్టణం మేళాపురానికి చెందిన బాబావలి, షాను దంపతులు ద్విచక్రవాహనంలో శెట్టిపల్లి దర్గాకు వచ్చారు. అక్కడ సోమవారం రాత్రి బస చేసి దర్గా వద్ద ప్రార్థనలు చేసుకున్నారు. అనంతరం మంగళవారం ఉదయమే లేచి తమ సొంత గ్రామమైన మేళాపురానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. కొడికొండ చెక్‌పోస్టు కేశవరెడ్డి పెట్రోల్ బంకు వద్దకు రాగానే వెనుకనుంచి వచ్చిన కారు ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు దంపతులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో షాను (60) అక్కడికక్కడే మృతి చెందగా, బాబావలి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పరిగి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పరిగి చెరువులో పడి కదిరమ్మ (65)అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు ఇప్పటివరకు నాలుగైదుసార్లు ఆమె ఆత్మహత్యకు యత్నించంగా కుటుంబసభ్యులు గమనించి, అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం ఎవరూలేని సమయంలో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి శవాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీకాలనీకి చెందిన శ్రావణి మంగళవారం ఆత్మహత్యకు యత్నించింది. చౌడేశ్వరీ కాలనీలో వేణుగోపాల్, శ్రావణి దంపతులు నివాసముంటున్నారు. కుటుంబ కలహాల కారణంగా శ్రావణి ఇంటిలోని పైకప్పుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటిబయట ఉన్న బంధువులు గుర్తించి వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

బీజేపీ మండల అధ్యక్షుడి ఎన్నిక

పరిగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పరిగి మండల బీజేపీ అధ్యక్షునిగా ఎన్‌ఎల్ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి పరిగి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మండల నాయకులతో సమావేశమై అధ్యక్షుడిని ఎనుకున్నారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బూత్ కమిటీ సభ్యులను బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి మేదర శ్రీనివాసులు, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

కొత్తచెరువు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణపై గ్రామసభను మండలంలోని తలమర్ల ఆర్డీటీ పాఠశాలలో సర్పంచ్ రత్నమ్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ నీలకంఠారెడ్డి, సిఐ ఇందిరా మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మానవహక్కులపై పూర్తి స్థాయి లో అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీకాలనీ ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలోని కొండకిందతండాల్లో మంగళవారం తహసీల్దార్ రంగనాయకులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాబర్టువిల్సన్, ఎస్‌ఐ దాదాపీర్ పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒకరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు డాక్టర్ ఆరుద్రా శ్రీనివాస్, వీరనారాయణ, వీఆర్‌ఓలు, తండావాసులు పాల్గొన్నారు.



కొత్తచెరువులో మాట్లాడుతున్న తహసీల్దార్ నీలకంఠారెడ్డి



కొత్తచెరువు: వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



గాండ్లపెంట: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

కొత్తచెరువు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతి నెలా సామాజిక పింఛన్లను క్రమం తప్పకుండా అందజేస్తోంది. అయితే జనవరి ఒకటో తేదీ సెలవు కావడంతో.. డిసెంబరు 31వ తేదీనే సామాజిక పింఛన్లుపంపిణీ చేశారు. కొత్తచెరువులో ఎమ్మెల్యే పల్లెసింధురారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు.

● నల్లమాడ: స్థానిక బీసీ కాలనీలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం కమ్మవారి పల్లిలో పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గాండ్లపెంట: కదిరి-రాయచోటి రోడ్డులోని ఆటోస్టాండ్ వద్ద మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ఎమ్మెల్యే పింఛన్లుపంపిణీ చేశారు.



మంచుతో కప్పేసిన ధర్మవరం-చిగిచెర్ల రహదారి



చిగిచెర్ల వద్ద పొగమంచులో నెమ్మదిగా వెళ్తున్న రైలు

కప్పేసిన పొగమంచు

ధర్మవరంరూరల్/తాడిమర్రి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ధర్మవరం, తాడిమర్రి మండలాల్లో రాత్రి, ఉదయం వేళలల్లో పొగమంచు భారీగా ఉంటోంది. ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు మళ్లీ ఎక్కువగా ఉంటోంది. ఇలా పొగమంచు కమ్మేయడంతో రోడ్లు, రైల్వేలైన్లు కనిపించలేదు. దీంతో బస్సులు నెమ్మదిగా.. ఆలస్యంగా వస్తున్నాయి. సిగ్నల్స్ కనిపించక రైళ్లు లైట్లు వేగాన్ని తగ్గించి వెళ్తున్నాయి. గ్రామాలన్నీ దట్టమైన మంచుతో కప్పిపోయాయి.





తాడిమర్రి వీధుల్లో పొగమంచు

అసైన్డ్ భూమిని పేదలకు కేటాయించాలి

తాడిమర్రి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గతంలో ఇక్కడ వీఆర్‌ఓగా పనిచేసిన ఓ అధికారి తన భార్యపేరు మీదుగా పట్టాదారు పాసుపుస్తకం సృష్టించి భూమి కేటాయించుకున్నాడని, ఆ భూమిని పేదలకు కేటాయించాలని టీఎస్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముంటిమడుగు హర్ష డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సర్వేనెంబరు 321-1లో 2.30 ఎకరాల భూమిని అప్పట్లో వీఆర్‌ఓగా పనిచేసిన వ్యక్తి తన భార్యపేరుమీదుగా రిజిస్ట్రర్ చేయించుకున్నాడని ఆరోపించారు. ఆ పట్టాను రద్దు చేసి గత ప్రభుత్వ హయాంలో అక్రమ రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లుకోల్పోయిన వారికి, పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ నాటి వీఆర్‌ఓ కాటమయ్యకు నోటీసులు జారీ చేశారు. కాటమయ్య భార్య ఈశ్వరమ్మ పేరు మీద ఉన్న ఖాతా నెంబరు 1222 పట్టాదారు పాసుపుస్తకాన్ని ఎందుకు రద్దు చేయకూడదో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

● మాజీ వీఆర్‌ఓ భార్యకు పింఛన్

మండల కేంద్రానికి చెందిన ఓ మాజీ వీఆర్‌ఓకు భార్య, ఇద్దరు మగపిల్లలు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలు కూడా అయ్యాయి. అతని భార్య ఒంటరి మహిళ పింఛన్‌ను గత ఐదేళ్లగా పొందుతున్నారని టీడీపీ నాయకులు ఎంపీడీఓ రంగారావుకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ సదరు పింఛన్ నంబరు 12500037160ను పరిశీలించి రద్దు చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులకు సిఫారసు చేస్తానన్నారు. ఈ పింఛన్ నెలరోజుల క్రితం తాడిమర్రి గ్రామ పంచాయతీ నుంచి అనంత పురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లి పం చాయతీకి మార్చారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు గంగాధర్‌గుప్తా, టీడీపీ నాయకులు శివంపల్లిగంగయ్య, పక్కీర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, మురళి ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థికసాయం

నల్లచెరువు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక దిగువబజారులో నివాసమున్న భవన నిర్మాణ కార్మికుడు కొమ్మెర శివరాంప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఓదులపల్లి అబ్దుల్‌ఖాదర్, అల్లుడు మహమ్మద్‌ఫారూక్ కలిసి రూ. ఐదువేలును శివరాంప్రసాద్‌కు మంగళవారం అందచేశారు.

● మృతుడి కుటుంబానికి..

స్థానిక నల్లగుట్ట వీధిలో నివాముంటున్న సూర్యనారాయణ(45) బ్రెయిన్ స్ట్రోక్‌తో మంగళవారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి మాజీ సర్పంచ్ మండెం రవికుమార్‌రెడ్డి నివాళ్లు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ. పదివేలు ఆర్థికసాయం అందచేశారు. ఆయన వెంట నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, గోవిందుచంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

షెడ్ కూల్చివేతపై కేసు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు పంచాయతీ కొత్తరోడ్డు సమీపంలో నిర్మించిన షెడ్ కూల్చివేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. ఇనగలూరు పంచాయతీ కొత్తరోడ్డు సమీపంలో సర్వే నెంబర్ 672లో 1.35 ఎకరాను చలపతినాయుడు యాసిన్‌సాబ్‌కు అమ్మారు. యాసిన్ సాహెబ్ వద్ద 2014లో విజయభారతి ఆ స్థలాన్ని కొనుగోలు చేసింది. జయభారతి ఆ పొలంలో 35 సెంట్లలో ఆవుల షెడ్ ఏర్పాటు చేసుకుంది. చలపతినాయుడు ఎక్స్‌కవేటర్‌తో ఆ షెడ్‌ను కూల్చివేశారు. దీనిపై జయభారతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చలపతి నాయుడుపై కేసు నమోదుచేసి, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ బి. మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు.



కూల్చివేసిన షెడ్

బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుల ఎంపిక

ధర్మవరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులను ఎంపిక చేసినట్టు ఎన్నికల ఆర్‌ఓ శంకరచంద్ర మంగళవారం తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా జింకా చంద్రశేఖర్, మండల అధ్యక్షుడిగా గొట్లూరు చంద్రను ఎంపిక చేశామన్నారు. బీజేపీ స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, సీనియర్ నాయకులు అంబటి సతీశ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, నాయకులు పాల్గొన్నారు.

● నల్లచెరువు: బీజేపీ మండలాధ్యక్షుడిగా కమ్మల వేమనారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనకల్లు మండలాధ్యక్షుడు హసనాపురం చంటి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మండలంలోని 28 బూతుల అధ్యక్షులు, శక్తి కేంద్ర ప్రముఖులు హాజరయ్యారు. కమ్మల వేమనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● బత్తలపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడిగా అకులేటి భాస్కర్‌ను ఎన్నుకున్నారు. స్థానిక ఆర్‌కే కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ సర్వసభ్య సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు.

● తాడిమర్రి: మండల బీజేపీ అధ్యక్షుడిగా దేవర రామ్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వీరభద్రయ్య స్వామి ఆలయ ఆవరణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎంపికచేశారు.

ఈ-క్రాప్ తర్వాతే బీమా కట్టించుకోవాలి

బత్తలపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసే పంటలకు ఈ క్రాప్ చేసిన తరువాత వ్యాంకర్లు బీమా కట్టించుకోవాలని దంపేట్ల సర్పంచ్ చల్లా కరునాకర్‌నాయుడు అధికారులను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సాగుచేసే పంటలకు బ్యాంకర్లు మే, జూన్, జూలైనెలలో పంటలకు బీమా కట్టించుకొంటున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఈ క్రాప్ చేసిన తరువాత పంటలకు బీమా చేస్తే రైతులకు ఇన్సురెన్స్ డబ్బులైనా మిగులుతాయన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ స్వర్ణలత, ఎంపీపీ త్రివేణి, ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏఓ శ్రీనివాసులు, ఏఈలు శివయ్య, జ్యోతి, కాశీవిశ్వనాథ్, పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

బుక్కపట్నం చెరువుకు నీటి విడుదల

పుట్టపర్తి,రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకమ్మవారి పల్లి సమీపంలో హంద్రీనీవా కాలువ నుంచి జలాలను బుక్కపట్నం చెరువుకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ పాలనలో రైతు ఆనందంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమన్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్లు రామాం జినేయులు, విజయ్‌కుమార్, నాయకులు శుభచంద్ర, రామ్, సూరి, గంగాదర్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, వెంకటేస్ కిష్టప్ప పాల్గొన్నారు.



చెరువుకు నీటి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

● పూలబొకేలు ఎవరూ తేవద్దు

నూతన సంవత్సర వేడుకలకు ఎవరూ పూలదండలు, బొకేలు, వంటివి తేవద్దని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. పేద విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకాలు, పెన్నులు ఇవ్వాలని సూచించారు.

ఖాద్రీశుడి క్యాలెండర్ ఆవిష్కరణ

కదిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి క్యాలెండర్‌ను మంగళవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ పనుల వద్దకే వెళ్లి పింఛన్

ధర్మవరంరూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామంలో సచివాలయ ఉద్యోగి వెటర్నరీ అసిస్టెంట్ ప్రభాకర్ పింఛన్‌దారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు అందజేశారు. కొంత మంది ఉదయాన్నే ఉపాధిహామీ పనులకు వెళ్లడంతో ఆయన ఆ పనులు ఎక్కడ జరుగు తున్నాయో తెలుసుకుని అక్కడికే వెళ్లి పింఛన్లు అందజేశారు.



ఉపాధిహామీ కూలీలకు పింఛన్ ఇస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

సైన్స్ ఎగ్జిబిషన్‌లో సత్తా

ధర్మవరం రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలస్థాయి (వైజ్ఞానిక) సైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం నిర్వహించారు. పట్టణ, మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయుల సహకా రంతో తయారు చేసిన 41 నమూనాలను ఈ ప్రదర్శ నలో ఉంచారు. బీఎస్సార్ బాలుర ఉన్నత పాఠ శాల నుంచి ప్రణీత్, గ్రూప్ లెవల్ సైన్స్ ప్రాజెక్టు విభాగంలో మోటుమర్ల కేజీబీవీ పాఠశాల విద్యార్థినీ యాస్మిన్, టీచర్ ప్రాజెక్టు నుంచి రాజేంద్రప్రసాద్ నమూనాలు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం రఫీక్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు గోపాల్, ప్రసాద్, రంగయ్య, రామకృష్ణ, హరికృష్ణ, పీడీ నాగేం ద్ర, లీలావతి, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వడ్డెర్ల సంఘం కమిటీ ఎన్నిక

ముదిగుబ్బ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల వడ్డెర్ల సంఘం కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళీ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా వెంకటేష్, అధ్యక్షుడిగా ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా రమణ, ప్రధాన కార్యదర్శిగా శివ, కోశాధికారిగా నరేంద్రను ఎంపిక చేశారు.



నూతన సభ్యులను సన్మానిస్తున్న ప్రముఖులు

ఈకేవైసీ తప్పనిసరి

కదిరి, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): కదిరి సైదాపురం సొసైటీ సహకార సంఘంలోని రుణాలు పొందిన రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సీఈఓ హనుమంతురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈకెవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ పథకాలు అందవన్నారు. కావున ప్రతి సభ్యుడూ తప్పకుండా సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

● ఓబుళదేవరచెరువు : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కంప్యూటరీకరణలో భాగంగా సహకార సంఘంలో ఓటు హక్కు కలిగిన సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సీఈఓలు రామాంజనేయులు, రామమోహన్ తెలిపారు. ప్రతి సభ్యుడు తప్పకుండా ఆయా సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రొళ్ల, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): రొళ్ల మండలంలోని వన్నారనపల్లి క్రాస్ వద్ద అక్ర మంగా మద్యం తరలిస్తున్న ఆవిన కుంట తాండాకు చెందిన శశికిరణ్ నాయక్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. అతని వద్ద నుంచి 50 ఒరిజినల్ ఛాయిస్ మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసు కొని కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా..

నూతన సంవత్సర వేడుకలకు ఆఫర్లు

● ధరలు మాత్రం రెట్టింపు

హిందూపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలకు అన్నీ సిద్ధమయ్యాయి. దీంతో కొన్ని వస్తువుల ధరలను విపరీతంగా పెంచారు. కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకునేందుకు కేక్‌లు సిద్ధం చేశారు. కొన్ని రెస్టారెంట్లలో బిర్యానీ పాయింట్లలో ఆఫర్‌లు ప్రకటించారు. బిర్యానీ కొంటే కూల్‌డ్రింక్ బాటిల్ ఉచితం అని, మరికొన్ని చోట్ల బిర్యానీ కొంటే వాటర్‌బాటిల్ ఉచితమని ప్రకటించారు. బేకరీల్లో అయితే వివిధ రకాల కేక్‌లు సిద్ధం చేశారు. కానీ ధరలు కూడా అదేస్థాయిలో పెంచేశారు. నూతన సంవత్సర ప్రారంభంలోనే పూల ధరలను అమాంతంగా పెంచేశారు. రూ.100 బొకే రూ.200 పలుకుతోంది.

నూతన ఆలోచనలతో ముందుకెళ్దాం



న్యూఇయర్ వేడుకలలో న్యాయాధికారులు, న్యాయవాదులు

హిందూపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన ఆలోచనతో కొత్త సంవత్సరంలో ముందుకెళ్దామని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. నూతన సంవత్సర వేడుకలను మంగళవారం కోర్టు ఆవరణంలో ఒక రోజు ముందుగానే కేక్‌కట్‌చేసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారులు శ్రీధర్, రాజ్యలక్ష్మీ, లలితలక్ష్మి, సుకుమార్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనతో కక్షిదారులకు మంచి సేవలు అందించాలన్నారు. పాతజ్ఞాపకాలను నెమరవేసుకుంటూ కొత్త యేడాదిలోకి అడుగు పెడదామన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ నాయకులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదవృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలి



న్యాయవాది చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

హిందూపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): న్యాయవాదవృత్తిలో నైపుణ్యతను పెంపొందించుకోవాలని అదనపు జిల్లా న్యాయాధికారి శైలజ సూచించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ న్యాయవాది అశ్వర్థనారాయణరెడ్డి సంస్మరణసభ మంగళవారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మీ, లలితలక్ష్మీ, సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, ఏపీపీ ఇందాద్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాబ్బాబు..! ఆ సంగతి అడగొద్దు!



● రాయచూర్ ప్యాసింజర్ రైల్లో ప్రయాణికుల పాట్లు
● అనుకూలమే కానీ.. అడుగడుగునా సమస్యలే..
● టాయిలెట్లు లేక మహిళలు, చిన్నారులకు ఇబ్బందులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణం కన్నా రైలు ప్రయాణం చాల అనుకూలం. అందులోనూ బస్సు ఛార్జీలతో పోల్చితే రైలు ఛార్జీలు మరీ తక్కువ. దీంతో చాలా మంది ప్రయాణికులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం చేయవచ్చని రైళ్ళనే ఎంచుకుంటారు. ఇక ఉద్యోగస్తులైతే సీజన్ టికెట్ తీసుకొని ప్రయాణిస్తుంటారు. అంతవరకూ బాగానే ఉన్నా ఇటీవల ప్రవేశపెట్టిన కొత్త రైళ్ల విషయంలో అనేక విచిత్ర సమస్యలు ఎదురవుతున్నాయి.

ఇటీవల రైల్వే యాజమాన్యం హిందూపురం- రాయచూరు ప్యాసింజరును ఏర్పాటు చేసింది. ఈ రైలులో ప్రతి రోజు వేలాది మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు వెళ్ళి వస్తున్నారు. హిందూపురం నుంచి అనంతపురానికి దాదాపు వంద కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అదే విధంగా పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రం కసాపురంకు వెళ్ళాలంటే అక్కడికి సమీపంలోని గుంతకల్లుకు దాదాపు రెండు వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అందుచేత ఎక్కువ మంది అనంతపురం, గుంతకల్లు ప్రయాణికులు ఈ రైలునే ఎంచుకుంటారు.

ఇదంతా మామూలేగదా అనుకుంటున్నారా? అసలు ట్విస్ట్ ఇక్కడే ఉంది.



ఈ ప్యాసింజర్ రైలులో అన్నీబాగానే ఉన్నా, అసలైన టాయిలెట్ సౌకర్యం మాత్రం లేదు. ఇంకేముంది.. దీంతో అత్యవసర సమయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిన్న పిల్లలైతే ఏదో న్యూస్ పేపర్‌తో పని కానిచ్చేసి తరువాత పేపర్ బయట పడేస్తున్నారు. అందులోనూ నీరు లేకపోవడంతో వాటర్ బాటిల్ కొనుక్కొని శుభ్రం చేస్తున్నారు. పురుషులైతే అత్యవసర సమయాల్లో ఏదో ఒక స్టేషన్‌లో దిగిపోవచ్చు, కానీ మహిళల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఇలా వందల కిలో మీటర్లు టాయిలెట్లు లేకుండా ప్రయాణించాలంటే ఇబ్బందులు చెప్పనలవి కాకుండా తయారయ్యాయి.

బాబ్బాబూ.. ఆ సంగతి మాత్రం.. మాకు తెలియదు

ఏమిటిదంతా అని హిందూపురం అధికారులను అడిగితే.. ఈ రాయచూర్ ప్యాసింజర్ రైలు గుంతకల్లు డివిజన్‌కు సంబంధించినదని, టాయిలెట్ల సంగతి తమకు తెలియదని చేతులెత్తేస్తున్నారు. ఇది తమ డివిజన్‌కాదు కనుక అందులో అసౌకర్యాల గురించి ఉన్నతాధికారులకు తాము చెప్పలేమని దాటవేస్తున్నారు. ఇలాంటి సరిస్థితులలో గుంతకల్లు డివిజన్ డీఆర్ఎం ఈ రైలుపై దృష్టి సారించి టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇలాగైతే ఎలా?



నేను కార్మికుడిని. కొన్ని సమయాల్లో పనుల నిమిత్తం బయటి ఊర్లకు వెళ్తుంటాము. కూలీలను తీసుకెళ్లాలంటే రైలు ప్రయాణమే సౌకర్యం. పిల్లలను తీసుకెళ్లాలన్నా అనుకూలంగా ఉంటుంది. టాయిలెట్ లేకపోతే ఎలా? ఒక రోజు నాకు ఇదే పరిస్థితి ఎదురైంది. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

శివ, ప్రయాణికుడు

పేదల కళ్లలో ఆనందం చూడాలన్నదే లక్ష్యం

●పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మండలంలోని ఎగువ అచ్చంపల్లి, డి.రామగిరి, అచ్చంపల్లి తండాలోని మూడు గ్రామాల్లో వృద్ధులకు మంగళవారం ఆయన పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమ తిప్పేస్వామి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాలో అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సోనియాబాయ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి,డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ వార్డెన్ వినోద్‌ను విధుల నుంచి తప్పించాలి

అగళి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అగళి మోడల్ పాఠశాలలోని బాలికల వసతి గృహంలో పనిచేస్తున్న హాస్టల్ వార్డెన్ వినోద్‌ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని ఎంఈఓ, డీఈఓలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశించారు. అగళి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల వసతి గృహంలో హాస్టల్ హాజరుకు పాఠశాలలో విద్యార్థుల హాజరుకు వ్యత్యాసం ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికలు వారి సమస్యలను ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీకు చెప్పుకుని కన్నీటి పర్యంతమయ్యారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఒకరోజు ముందే పింఛను నిర్ణయం సీఎం ఘనత

మడకశిరటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా లబ్ధిదారులకు ఒక్క రోజు ముందే పింఛను అందించే నిర్ణయం తీసుకొన్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని, ముఖ్యమంత్రి స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి




వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

పింఛను అందించిన దాఖలాలు లేవని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎవరైనా ముఖ్యమంత్రి చంద్రబాబు తర్వాతే అన్నారు.

డ్వాక్రా నిధుల స్వాహాపై న్యాయం కోసం మహిళల మొర

మడకశిర నియోజకవర్గంలో పలు మండలాల్లో గ్రామైక్య సంఘాల్లో ఆనిమేటర్లు డ్వాక్రా సంఘాల సభ్యుల డబ్బులు ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేస్తుండటంతో సభ్యుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని గుండుమల గ్రామ సమైక్య సంఘం సభ్యులు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిని కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. 14 సంఘాలకు సంబంధించి రూ.23లక్షలు అప్పటి సీసీ అండతో ఆనిమేటర్ స్వాహా చేసి పరారయినట్లు ఎమ్మెల్యే వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

షెడ్ కూల్చివేతపై కేసు



కూల్చివేసిన షెడ్

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు పంచాయతీ కొత్తరోడ్డు సమీపంలో నిర్మించిన షెడ్ కూల్చివేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేశారు. ఇనగలూరు పంచాయతీ కొత్తరోడ్డు సమీపంలో సర్వేనంబర్ 672లో 1.35 ఎకరాను చలపతి నాయుడు యాసిన్‌సాబ్‌కు అమ్మారు. యాసి న్ సాహెబ్ వద్ద 2014లో విజయభారతి ఆ స్థలాన్ని కొనుగోలు చేసింది. జయభారతి ఆ పొలంలో 35 సెంట్లలో ఆవుల షెడ్ ఏర్పాటు చేసుకుంది. చలపతినాయుడు ఎక్స్‌కవేటర్‌తో షెడ్‌ను కూల్చివేశారు. దీనిపై జయభారతి.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చలపతినాయుడుపై కేసు నమోదుచేసి, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు.

ఏకగ్రీవంగా బీజేపీ మండల అధ్యక్షుడి ఎన్నిక

పరిగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పరిగి మండల బీజేపీ అధ్యక్షునిగా ఎస్ఎల్ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి పరిగి వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మండల నాయకులతో సమావేశమై అధ్యక్షుడిని ఎనుకున్నారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బూత్ కమిటీ సభ్యులను బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి మేదర శ్రీనివాసులు, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెనుకొండ నుంచి మమత..

పెనుకొండ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన మండల అధ్యక్షురాలిగా మమతను బీజేపీ నాయకులు ఎంపిక చేశారు. నాయకులు రామక్రిష్ణ, గోపీనాథ్, మేకల రవిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

సోమందేపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం తనిఖీచేశారు. ఆమె ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లోనూ సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు ఓంకార్‌తో ఆర్బీఎస్‌కె కార్యక్రమం కింద పాఠశాల విద్యార్థులకు జరుగుతున్న స్క్రీనింగ్ కార్యక్రమంపై ఆరాతీశారు. క్యాన్సర్‌కు సంబంధించిన సర్వే, ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన కార్డుల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు.

పెనుకొండ యూపీహెచ్‌సీ తనిఖీ

పెనుకొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యుపీహెచ్‌సీ కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం ఆకస్మికంగా తనిఖీచేశారు. మంగళవారం పెనుకొండకు వచ్చిన ఆమె ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేసి రికార్డులు, అటెండెన్స్ రిజిష్టరు, మందుల గోడౌన్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

చిలమత్తూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి దర్గా వద్ద నిద్రచేయాలని వచ్చి రోడ్డుప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. హిందూపురం పట్టణం మేళాపురానికి చెందిన బాబావలి, షాను దంపతులు ద్విచక్రవాహనంలో శెట్టిపల్లి దర్గాకు వచ్చారు. అక్కడ సోమవారం రాత్రి బస చేసి దర్గా వద్ద ప్రార్థనలు చేసుకున్నారు. అనంతరం మంగళవారం ఉదయమే లేచి తమ సొంత గ్రామమైన మేళాపురానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. కొడికొండ చెక్‌పోస్టు కేశవరెడ్డి పెట్రోల్ బంకు వద్దకు రాగానే వెనుకనుంచి వచ్చిన కారు ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు దంపతులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో షాను (60) అక్కడికక్కడే మృతిచెందగా, బాబావలి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీకాలనీకి చెందిన శ్రావణి మంగళవారం ఆత్మహత్యకు యత్నించింది. చౌడేశ్వరీ కాలనీలో వేణుగోపాల్, శ్రావణి దంపతులు నివాసముంటున్నారు. కుటుంబ కలహాల కారణంగా శ్రావణి ఇంటిలోని పైకప్పుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటిబయట ఉన్న బంధువులు గుర్తించి వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పరిగి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పరిగి చెరువులో పడి కదిరమ్మ (65)అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు ఇప్పటివరకు నాలుగైదుసార్లు ఆమె ఆత్మహత్యకు యత్నించంగా కుటుంబసభ్యులు గమనించి, అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం ఎవరూలేని సమయంలో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రొళ్ల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని వన్నారనపల్లి క్రాస్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆవినకుంట తాండాకు చెందిన శశికిరణ్‌నాయక్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. అతని వద్ద నుంచి 50 ఒరిజినల్ ఛాయిస్ మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

పెనుకొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రిలియన్స్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులు విజ్ఞానం పొందేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ నాగవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ రన్నరప్ పెనుకొండ జట్టు



రన్నరప్ ట్రోఫీ అందుకుంటున్న పెనుకొండ కళాశాల జట్టు

పెనుకొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటి స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్‌టోర్నమెంట్‌లో పెనుకొండ జూనియర్‌కళాశాల జట్టు రన్నర్స్ కప్‌ను అందుకుంది. సెమీ ఫైనల్స్‌లో మంగళవారం వివేకానంద కళాశాల జట్టుతో పోటీపడి విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్న పెనుకొండ జట్టు ఫైనల్స్ పోటీల్లో న్యూటన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టుతో తలబడి పరాజయం పాలయింది. ట్రోఫీ విన్నర్స్‌గా న్యూటన్ కళాశాల, రన్నర్స్‌గా పెనుకొండ జూనియర్ కళాశాల జట్లు నిలిచాయి. ఇరుజట్లకు ఎస్పీ చేతుల మీదుగా కప్పులు అందజేశారు.

క్రీడలతోనే శారీరక, మానసికారోగ్యం

గోరంట్ల, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని క్రీడల వల్ల యువతలో మానసిక, శరీరక ఆరోగ్యం లభిస్తుందని వక్తలు వివరించారు. గోరంట్లలోనే ఎస్ఎపిఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో నెహ్రూయువకేంద్రం ద్వారా క్లస్టర్ లెవల్ స్పోర్ట్సు మీట్‌ను మంగళవారం నిర్వహించారు. ప్రగతి పథం యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు జరిపారు. వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు ట్రోపీ , మెడల్స్ ప్రశంసాపత్రాలు అందించారు. ఈకార్యక్రమంలో అనంతపురం నెహ్రూయువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ జీవన్ కుమార్; కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ అడవాల సూర్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.


HAPPY BIRTHDAY
జన్మదిన శుభాకాంక్షలు.
కదిరి నియోజకవర్గ ప్రజలకు
నూతన సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు
కదిరి శాసనసభ్యులు
గౌ॥ శ్రీ కందికుంట
వెంకట ప్రసాద్ గారికి
హార్థిక జన్మదిన
శుభాకాంక్షలు
HAPPY NEW YEAR 2025
ఎస్.కె.మస్తాన్‌వలి
తెలుగుదేశం నాయకులు, కొర్తికోట,
తనకల్లు (మం) శ్రీ సత్యసాయి జిల్లా
రెడ్డి శేఖర్‌రెడ్డి
టీడీపీ మండల కన్వీనర్
తనకల్లు
మంజునాథ్
తెలుగుదేశం పార్టీ నాయకులు
కొర్తికోట
హనుమంతరెడ్డి
టీడీపీ నాయకులు
మహమ్మద్ రఫీ
టీడీపీ నాయకులు



విజయలక్ష్మికి విషెస్ చెప్పేదాన్ని..

ఇంటర్ చదువుకునే రోజుల్లో నా బెస్ట్ ఫ్రెండ్ విజయలక్ష్మి. ఆమెది కర్నూలు జిల్లా. అక్కడే బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. అప్పుడు కొత్త ఏడాదికి తప్పకుండా విషెస్ చెప్పేదాన్ని. ఇప్పుడు సెల్‌ఫోన్ వచ్చాక అనాటి పరిచయాలు, జ్ఞాపకాలు చెరిపేస్తోంది. ఇప్పుడంతా కేక్ కటింగ్స్, సెల్‌ఫోన్‌లో చాట్ వంటివే నడుస్తున్నాయి. జనవరి ఫస్ట్ వచ్చిందంటే చిన్నప్పటి 50 పైసల పోస్టుకార్డులు, గ్రీటింగ్ కార్డులే గుర్తుకొస్తున్నాయ్.

మాది పెనుకొండ దగ్గరలో ఉండే గోనిపెంట తండా. అమ్మానాన్నలకు ఐదుగురం సంతానం. మా ఊరికి బస్సులు లేవు. చదువుకోడానికి ఉదయం మూడు గంటలపాటు అడవుల్లోంచి నడుచుకుంటూ పెనుకొండకు వచ్చేటోళ్లం. హైస్కూల్ చదువులు ముగిసిన తర్వాత పై తరగతులు వెల్ఫేర్ హాస్టళ్లలో ఉంటి చదువుకునే దాన్ని. మా ఊరంతా కలిస్తే... 500 మంది జనాభా. ఊర్లో జనవరి ఫస్ట్ అంటే పెద్దగా తెలీదు. కానీ హాస్టళ్లలో ఉండే పిల్లలం మేము చేసుకునేవాళ్లం. ప్రతి నెలా హాస్టల్ పిల్లలకు రూ.10 నుంచి రూ.15 కాస్మొటిక్ చార్జీలు ఇచ్చేవాళ్లు. అందులోంచి కొంత దాచుకుని.. గ్రీటింగ్ కార్డులు, కలర్స్ తెచ్చుకునేవాళ్లం. 50 పైసల పోస్టు కార్డులే పెద్ద గ్రీటింగ్ కార్డులు భావించే వాళ్లం. మా అన్నలు చదువుకున్నవారు కావడంతో ఇంట్లో ఇన్‌ల్యాండ్ లెటర్లు ఉండేవి. అందులో రాసి బంధువులు, మిత్రులకు శుభాకాంక్షలు చెప్పేవాళ్లం.

- సుమిత్ర, ఎస్జీటీ, నెహ్రూ మున్సిపల్ అప్పర్‌ప్రైమరీ స్కూల్, అనంతపురం

(ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య)





అనంత.. కేరింత..



ఎన్నో ఊహలు, మరెన్నో ఊసులు
ఎన్నో ఆశలు, మరెన్నో ఆశయాలతో
దోగాడిన ఏడాది కాలగమనంలో కలిసిపోయింది.
చేదును మరిచి... తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ..
కొత్త మజిలీ ప్రయాణానికి సర్వం సిద్ధమైంది.
నవ్య పథాన్ని భవ్యమైన లక్ష్యాలతో
సుమనోహరంగా స్వాగతిస్తోంది కొత్త ఏడాది.
ఈ సందర్భంగా..
నేటి పెద్దలు చిన్ననాటి ముచ్చట్లను
జ్ఞాపకాల దొంతరల నుంచి దించి
చిన్నపిల్లల్లా చెబుతూ సంబరపడుతుంటే ...
వినడానికే ఎంతో ఇంపుగా ఉంది. అందుకే
కాలం ఒక్కసారి వెనక్కి వెళితే
వాహ్..! ఎంత బాగుంటుందో..!
అస్తమించిన రవిని తలచుకుని వేదన పడటం కంటే
నవోదయంలో బాల భానుడిని స్వాగతించటం మేలు కదా



ఊసులు.. ఉషస్సులు 2025

కొత్త ఏడాదిలోకి కాలం అడుగులు.. జ్ఞాపకాల మూటలతో జనం కూడా..





2024 తుది సంధ్య
బుక్కరాయసముద్రం చెరువులో..

సొంత ఆటో కొంటా..



ఈ ఏడాది సొంతంగా ఆటో కొనుక్కోవాలనుకుంటున్నా. ఫైనాన్స్ కంతులు చూసి భయమేసి 2024లో షోరూం ఆటో కొనలేక పోయా. డబ్బులు సమకూర్చుకుని కొత్త ఏడాదిలో తప్పకుండా కొత్త ఆటో కొంటా. నా చిన్నప్పటి నుంచి కూడా న్యూ ఇయర్ వస్తోంది అంటే పండగ లాగే ఉండేది. ప్రతి ఏడాది చిన్ననాటి మిత్రులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేవాడిని. అయితే మూడేళ్లుగా నా మిత్రుల్లో ఇద్దరికి విషెస్ చెప్పలేకపోతున్నా. సత్యదీప్ ఆస్ట్రేలియాలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. నరేష్ గుజరాత్‌లో పనిచేస్తున్నాడు. వీరి ఫోన్ నంబర్లు నాదగ్గర లేవు. వారి నంబర్లు తెలుసుకోవడానికి ఎంతగానో ప్రయత్నించినా ఫలితం లేదు. ఈసారి ఎలాగైనా ఫోన్ నంబర్లు సంపాదించి, విషెస్ చెప్తా. మా చిన్నప్పుడు డిసెంబరు నెల వచ్చిందంటే 31వ తేదీ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేవాళ్లం. ఆ రోజు రాత్రి మా మిత్రులందరూ కలిసి భోజనాలు వండించుకుని తినేవాళ్లం. బయట సైకిళ్లపై షికారు చేస్తూ రాత్రంతా ఆనందంగా గడిపేవాళ్లం. అర్ధరాత్రి సమయంలో కేక్ కట్ చేసి విషెస్ చెప్పుకునేవాళ్లం. జనవరి 1న సినిమా హీరోల గ్రీటింగ్‌లు తీసుకొని ఒకరికొకరు ఇచ్చుకొని హ్యాపీ న్యూయర్ చెప్పుకునేవాళ్లం. అయితే పెళ్లి అయిన తరువాత కుటుంబసభ్యులతో ఆ ఆనందాన్ని పంచుకుంటున్నా. కొత్త సంవత్స రంలో ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు లాంటివి ఏర్పాటు చేస్తే మాకు భరోసాగా ఉంటుంది. ఆటో డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్పులు ఇస్తే బాగుంటుం దని కోరుకుంటున్నా.

- ఆటో డ్రైవర్ శ్రీనివాసులు, అనంతపురం

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

ఇంకా బాగా చదువుతా..



అనంతపురం విద్య: 'మాది అనంతపురం. నాన్న వన్నూరుస్వామి, అమ్మఅలివేలమ్మ. పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఉంటున్నాం. 2023లో జూనియర్ కళాశాలలో ఓ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరయ్యా. పాల్గొన్న 9 మందిలో నన్ను సెలెక్ట్ చేశారు. అప్పుడు కలిగిన ఫీలింగ్ జీవితంలో మర్చిపోలేను. కానీ 2024లో ఎక్కువ సార్లు స్కూల్‌కు ఆబ్‌సెంట్ అయ్యా. మాతోటి ఫ్రెండ్స్‌ను ఎక్కువ మిస్సయ్యా. కొత్త ఏడాదిలో మాత్రం ప్రశ్నించే అధికారి(సీబీసీఐడీ) కావడానికి తగ్గట్టుగా బాగా చదువుకోవాలని సంకల్పించుకున్నా. సమాజంలో కొందరు డబ్బులను దోచేస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులు అవినీతితో డబ్బులు పోగేసుకుంటున్నారు. దీంతో చాలా మంది ప్రజలు నష్టపోతున్నారు. రాజకీయ నాయకులను ప్రశ్నించేందుకు కలెక్టర్ పోస్టు కూడా కరెక్ట్ కాదన్నది నా అభిప్రాయం. అందుకే అందరినీ ప్రశ్నించే అధికారిని కావాలనుకుంటున్నా. కొత్త ఏడాదిలో ఇదే బలమైన నిర్ణయం. గ్రీటింగ్‌కార్డులు బ్రిటీష్ పాలనలో మనకు అలవాటు చేశారని మా స్కూల్ టీచర్లు చెప్పారు. అందుకే వాటిని మేం వాడం. పేపర్ క్రాఫ్ట్ చేసి నా ఫ్రెండ్స్‌కు పంచుతా. నా ఫ్రెండ్ ఇషిత గుడ్ న్యూస్ అయినా...బ్యాడ్ న్యూస్ అయినా మొదట నాకే చెబుతుంది అందుకే తను నా బెస్ట్ ఫ్రెండ్. తనతో కొత్త ఏడాది విషెస్ షేర్ చేసుకుంటా.

- ముక్తేశ్వరి, ఏడో తరగతి, నెహ్రూ స్కూల్, అనంతపురం

ఇద్దరం ఒకే ఊరిలో పని చేయాలి..

కానిస్టేబుల్ రామ్‌ప్రసాద్



నేను బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నా. నా భార్య పవిత్ర నార్పలలో ఏఎన్‌ఎంగా చేస్తోంది. ఇద్దరం స్పౌజ్ కింద ఒకే ఊర్లో ఉద్యోగం వస్తే బాగుంటుందనుకున్నాం. కానీ 2024లో ఆరోగ్యశాఖలో బదిలీలు జరగలేదు. దీంతో ఒకే ఊర్లో పని చేయాలన్న కోరిక తీరలేదు. నూతన సంవత్సరంలోనైనా తీరుతుందేమోనని ఆశగా ఉన్నా. చిన్నప్పుడు కొత్త సంవత్సరం వస్తుందంటే ఆ జోరే వేరు. కొత్త డ్రస్సులు కొనిచ్చుకునేవాళ్లం. బడిలో స్నేహితులందరికీ చాక్లెట్లు పంచిపెట్టేవాళ్లం. కొంత వయసు వచ్చాక అందరం కలిసి కేక్ కొని కట్ చేసి ఆనందం పంచుకునేవాళ్లం. ఇక అప్పట్లో సినిమా హీరోల గ్రీటింగ్స్‌తోనే శుభాకాంక్షలు చెప్పుకునేవాళ్లం. గ్రీటింగ్స్‌పై స్నేహితుల పేర్లు రాసి వారికి ఇచ్చేవాళ్లం. అదే అమ్మాయిలకైతే ఫ్లవర్స్ ఉన్న గ్రీటింగ్స్ ఇచ్చేవాళ్లం. చిన్న నాటి స్నేహితులకు అప్పట్లోలా ఇప్పుడు గ్రీటింగ్ కార్డు, ఇతరత్రా పంపలేం. కొరియర్ ద్వారా కుదరని పరిస్థితి. కేవలం వాట్సాప్ ద్వారానే శుభాకాంక్షలు చెబుతున్నాం.

ఈ ఏడాది ఆ స్నేహితుడిని కలిసి విషెస్ చెప్పాలని...

పాత స్నేహితులను తరచూ కలవాలని ఉంటుంది. కానీ కుదరడం లేదు. మారుతి అని చిన్ననాటి స్నేహితుడున్నాడు. అతను ఇప్పుడు తాడిపత్రిలో రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనితో చిన్న నాటి నుంచి ఎన్నో ఊసులున్నాయి. ఈ సారి కొత్త సంవత్సరం అతనికి శుభాకాంక్షలు చెప్పాలనుకుంటున్నాను.

మేనమామ పిల్లనివ్వనన్నాడు..

నేను ఏడో తరగతి ఫెయిల్ కావడంతో సినిమా థియేటర్ గేట్ కీపర్‌గా పని చేస్తుండేవాడిని. నా కుటుంబానికి అండగా ఉండాల్సిన పరిస్థితి. ఆ సమయంలో నాకు తన కుమార్తెను ఇవ్వడానికి మా మేనమామ ఒప్పుకోలేదు. దాంతో నాలో ఎదగాలనే కసి పెరిగింది. అనుకున్నదే తడవుగా టెన్త్ ఓపెన్‌లో చేశాను. తరువాత ఓపెన్‌లోనే ఇంటర్ పూర్తి చేశా. 2003లో హోంగార్డు ఉద్యోగం సాధించా. ఆ తరువాత 2007లో నోటిఫికేషన్ రావడంతో పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2009లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాను.

ప్రేమ పెళ్లికి యుద్ధమే చేయాల్సి వచ్చింది...

ఇంటర్ చదువుతున్న సమయంలో నేను, పవిత్ర ప్రేమించుకున్నాం. హోంగార్డుగా ఉన్న సమయంలో తనను ఇచ్చి పెళ్లి చేయమని కోరాను. కానీ ఆమె తండ్రి వెటర్నరీ డాక్టర్ కావడంతో హోంగార్డుగా ఉన్న నాకు తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయడానికి ఇష్టపడలేదు. పెళ్లి కోసం పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. చివరికి అందరినీ ఒప్పించి వివాహం చేసుకున్నాం. అలా 2006లో మా పెళ్లి జరిగింది. ఇద్దరు సంతానం బాబు రామ్‌చరణ్ పాలిటెక్నిక్, కుమార్తె భవ్య శరణ్య పదోతరగతి చదువుతోంది. కుమారుడు రెజ్లింగ్స్ నేషనల్స్‌లో ఆడాడు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఎస్సే రైటింగ్, వక్తృత్వపోటీల్లో నా కుమార్తె రెండు బహుమతులు సాధించడం, జిల్లా ఎస్పీ జగదీష్ సర్ చేతుల మీదుగా అందుకోవడం 2024లో నాకు బాగా గుర్తుండిపోయే సంఘటన.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం

అప్పటి కళే వేరు



ఓ 20 ఏళ్ల కిందటి వరకు జనవరి ఫస్ట్ వస్తోందంటే డిసెంబరు నెల నుంచే టైలర్ల షాపులు కళకళలాడేవి. చిన్న, పెద్ద అందరూ కొత్త దుస్తులు కుట్టించుకోవడానికి ఉత్సాహం చూపేవారు. పిల్లల కోసం కుట్టమని ఇచ్చిన బట్టలు చెప్పిన టైంకు కుట్టకపోతే షాపువద్దకు వచ్చి అక్కడే ఉండి కుట్టించుకుపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. మేము కూడా డిసెంబరు 31న అర్ధరాత్రి వరకు షాపు తెరచుకొని డ్రెస్సులు కుట్టేవాళ్లం. ఇంటికి కూడా కొన్ని దుస్తులు తీసుకు వెళ్లి తెల్లవారుజాము వరకు కుట్టి ఇచ్చేవాళ్లం. జనవరి ఫస్ట్‌కు ఇవ్వలేని సందర్భంలో కొందరు గొడవ పడేవారు. ఇదంతా గతం. ఇప్పుడు టైలర్లతో డ్రెస్సులు కుట్టించుకొనే వాళ్లు బాగా తగ్గిపోయారు. ఈ జనరేషన్ పిల్లలు అంతా రెడీమేడ్ దుస్తులే తొడుగుతున్నారు. పొద్దున జనవరి ఫస్ట్ అనగా రాత్రి అట్లా షాపునకు వెళ్లి ఇట్లా బట్టలు తెచ్చేసుకుంటున్నారు. **- వాసు, టైలర్, యాడికి**

మెకడమియా సాగు చేస్తా



నూతన సంవత్సరంలో ఉద్యాన పంటల దిగుబడిలో పురోగతి సాధించాలనేదే నా లక్ష్యం. బ్రహ్మాజెముడు మొక్కల నర్సరీతోపాటు మెకడమియా నట్స్ పంట పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నా. నేను పదో తరగతి చదివే సమయంలో జనవరి ఫస్ట్ వస్తోందంటే చెప్పలేని సంబరంగా ఉండేది. వారం ముందు నుంచే గ్రీటింగ్ కార్డులు కొనేవాళ్లం. వాటిని స్నేహితులకు చూపి ఎవరికి ఏది కావాలో అడిగి దానిపై వారి పేరు రాసేవాళ్లం. వాటిని జనవరి 1న కొత్త బట్టలు వేసుకొని ఆనందంగా స్కూల్‌కి వెళ్లి నా మిత్రులకు ఇచ్చేవాడిని. బంధువులకు పోస్టు ద్వారా గ్రీటింగ్స్ పంపేవాడిని. ఆదోనిలో ఇంటర్, డిగ్రీ చదివే రోజుల్లో గ్రీటింగ్ ఇచ్చుకోవడంతోపాటు కీప్యాడ్ ఫోన్ ద్వారా సెల్ ఫోన్లు ఉన్న ఫ్రెండ్స్‌కు మెసేజ్ ద్వారా శుభాకాంక్షలు చెప్పేవాడిని. ఇంటర్ నుంచి న్యూ ఇయర్‌ను స్వాగతిస్తూ ప్రతి సంవత్సరం డిసెంబరు 31 రాత్రి 12గంటలకు కేక్ కట్ చేసుకొని ఆనందంగా గడిపేవాళ్లం. డిగ్రీ పూర్తయిన తర్వాత ఫ్రెండ్స్ అంతా విడిపోయాం. ప్యాపిలి జడ్పీ స్కూల్‌లో పదోతరగతి క్లాస్‌మేట్స్‌లో బెస్ట్ ఫ్రెండ్స్ ఆర్.మురళీ కృష్ణ ప్రస్తుతం ఆయన రాజకీయాల్లో ఉన్నాడు. మరో ఫ్రెండ్ లతీఫ్ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాడు. డిగ్రీ పూర్తయిన తర్వాత నేను వ్యవసాయం మొదలు పెట్టా. అయినా ప్రతి ఏడాది వ్యాట్సాప్‌లో ఫ్రెండ్స్‌కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెబుతున్నా. ఐదేళ్ల కిందట మూడెకరాల్లో బ్రహ్మాజెముడు పంట సాగు చేశా. దాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న పలువురు రైతులు సాగు విధానం గురించి నన్ను సంప్రదిస్తున్నారు. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి వస్తున్నారు. దానిపై సలహాలు ఇస్తున్నా. ఆయా ప్రాంతాల్లోని రైతులకు బ్రహ్మాజెముడు మొక్కలను 2024 నుంచి సరఫరా చేయడం మొదలుపెట్టాను. ఈ ఏడాది బాగా గుర్తుండిపోయే సంఘటన ఇదే. ఈ ఏడాది మా పాత ఫ్రెండ్స్ అంతా కలిసి న్యూఇయర్ వేడుకలు జరుపుకునేందుకు ప్లాన్ చేస్తున్నాం.

- వెంకటేశ్వరరెడ్డి, ఊటకల్లు,

- గుత్తి రూరల్

కొత్త ఇల్లు కట్టుకోవాలి...



మాది రేకుల కుంట గ్రామం. నేను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నా. తర్వాత రేకులకుంటలోనే వ్యవసాయం చేసేవాడిని. 2024 సంవత్సరం ముగిసేనాటికి సొంతిల్లు కట్టుకోవాలనే సంకల్పంతో మూడేళ్ల కిందట అనంతపురం వచ్చి ఆకుకూరల వ్యాపారం మొదలు పెట్టా. వ్యాపారాన్ని వృద్ధి చేసుకోగలిగాను కానీ కొత్త ఇల్లు మాత్రం కట్టలేకపోయా. కొత్త సంవత్సరంలోనైనా సొంతిల్లుల్లు కట్టుకోవాలని ఆశిస్తున్నా. నేను చదువుకునే సమయంలో హాస్టల్‌లో నూతన సంవత్సర వేడుకలంటే సంబరంగా చేసుకునేవాళ్లం. హాస్టల్‌లో ప్రత్యేకంగా చికెన్ కర్రీ వండేవాళ్లు. స్నేహితులతో కలిసి మిఠాయిలు, చాక్లెట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకునేవాళ్లం. జనవరి 1న ఊరికి వెళ్లి, మిత్రులందరితో కలిసి ఊరంతా సందడి చేసేవాళ్లం. ప్రతి జనవరి 1న నా మిత్రులను కలుస్తుంటా.

- తిరుమలేష్, ఆకుకూరల వ్యాపారి

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

సొంతూరులో వేడుక చేసుకోవాలి..



వర్జీనియాలో
శ్రీహరి కుటుంబం

అనంతపురం క్లాక్‌టవర్: సొంతూరైన అనంతపురంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నది నా చిరకాల కోరిక. బంధుమిత్రులతో కలిసి అక్కడ వేడుకలు చేసుకోవాలని ప్రయత్నిస్తున్నా కుదరడం లేదు. ప్రస్తుతం నేను అమెరికాలో స్థిరపడ్డా. అక్కడ ఉన్నా భారతీయ సంస్కృతీసంప్రదాయాలంటేనే ఇష్టం. ఇండియా సంస్కృతి, సంప్రదాయాలంటేనే మక్కువ ఎక్కువ. కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవున్ని ప్రార్థిస్తున్నా. నూతన సంవత్సరం మనసుల్లో ఉండే రుగ్మతలు, దురాలోచనలు తొలగించి, కొంగొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నా. నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి ఒక్కరికి సత్ఫలితాలు, సరికొత్త ఆవిష్కరణలకు సహకరించాలని జనవరి 1న అమెరికాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నాం. నా మిత్రులు, బంధువులకు సోషల్ మీడియా, ఫోన్‌తో పాటు ఈ ఏడాది ప్రత్యేకంగా ఆంధ్రజ్యోతి ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు కుటుంబంతో కలిసి చెప్పే అవకాశం లభించడం సంతోషంగా ఉంది.



- ప్రవాసాంధ్రుడు శ్రీహరి

రైల్వేలో ఉద్యోగం సాధిస్తా..



నూతన సంవత్సర వేడుకలను పల్లెటూర్లలో మిత్రులతో కలిసి చేసుకుంటే సంబరమే వేరు. కూడేరు మండలం చోళసముద్రం మా సొంతూరు. కణేకల్లులో ఇంటర్ వరకు చదివా. ఆ తర్వాత 2019లో ఉపాధికోసం అనంతపురం వచ్చేశా. 2021లో ప్రభుత్వ వైద్య కళాశాలలో సెక్యూరిటీగార్డుగా చేరా. 2024లో మా వేతనాలు పెరుగుతాయని ఆశించాము, పెరగలేదు. అయితే ఈ ఏడాది మా అక్కకు కుమారుడు జన్మించడం నాకు మరిచిపోలేని తీపి గుర్తు. 2025లో రైల్వేలో ఉద్యోగం సాధించాలని ఆశిస్తున్నాను. ప్రస్తుత నా విధుల కారణంగా నూతన సంవత్సర వేడుకలు కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం కొంత ఇబ్బందే. గతంలో నేను చదువుకునే సమయంలో మా స్కూల్‌లో ఫ్రెండ్స్‌తో కలిసి చాక్లెట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడంతోపాటు ఇంటికి వచ్చాక మిత్రులతో కలిసి కేక్ కట్ చేయడం, జనవరి 1న రెస్టారెంట్‌కు వెళ్లి అందరం కలిసి బిరియానీ పార్టీ చేసుకోవడం లేదా ఏదైనా సినిమాకు వెళ్లే వాళ్లం. నా మిత్రుల్లో ఇప్పటికీ అత్యంత సన్నిహితంగా ఉన్నది సూర్యకిరణ్. ప్రతి నూతన సంవత్సరం రోజున సూర్యకిరణ్‌కే తొలుత శుభాకాంక్షలు చెబుతా.

- ఎర్రిస్వామి, సెక్యూరిటీగార్డు, ప్రభుత్వ వైద్య కళాశాల

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

2025